సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



కమనీయం.. రంగనాథస్వామి కల్యాణం

పులివెందుల పట్టణంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి తరించారు. -8లో



వృద్ధ దంపతుల ఆత్మహత్య

పెన్నా నదిలో దూకి వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య, నాంచారమ్మ దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.0/25.7

జిల్లాలో శుక్రవారం 25.7 - 35.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్


సర్కారీ మెడికిల్

జిల్లాకో ప్రభుత్వ వైద్య కళాశాల నెలకొల్పి వైద్య విద్యను సామాన్యులకు సైతం అందుబాటులోకి తేవాలన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయానికి గండి కొట్టారు. అందనంత దూరంలో ఉండే మెడికల్ కాలేజీ తమ చెంతకే వస్తుందని సంబరపడ్డ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు. అనుబంధంగా నెలకొల్పే బోధనాస్పత్రి ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందని ఆశించిన రోగులకు నిరాశ మిగిల్చారు. కేవలం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న ఒకే ఒక్క కారణంతో వైద్య విద్యను మిథ్యగా మార్చారు.

- పులివెందుల మెడికల్ కళాశాలపై ప్రైవేటు'
- పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు
- కాలేజీని వైఎస్సార్‌సీపీ నిర్మించినా వినియోగించుకోని కూటమి
- ఎన్ఎంసీ సీట్లు ఇచ్చినా తిరస్కరించిన వైనం
- మండిపడుతున్న జిల్లా వాసులు



పులివెందుల మెడికల్ కళాశాల



సాక్షి ప్రతినిధి, కడప: పుట్టిన గడ్డపై మమకారం. అవకాశం వస్తే తరతమ భేదం లేకుండా రాజకీయ ప్రత్యర్థుల ప్రాంతానికి సైతం విస్తృత సేవా చేయాలనే గుణం వైఎస్ కుటుంబం సొంతం. రాష్ట్రమంతా ముఖ్యమంత్రి అయినా కడప పట్ల కరుణ చూపడంలో చంద్రబాబు నాయుడు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులపైనే కాదు, ప్రాంతంపై కూడా విషం కక్కుతున్నారు. మంజూరైన మెడికల్ సీట్ల భర్తీకి విముఖత చూపగా, ఏకంగా ప్రభుత్వ వైద్య విద్య కళాశాలను ప్రైవేటు పరం చేస్తున్నారు.

రూ.530 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిరుపేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే తపన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఒక మెడికల్ కళాశాల నిర్మించాలనే సంకల్పంతో పులివెందులలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు 2020 డిసెంబర్ 2న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను నిర్మించారు. ఈ క్రమంలో పులివెందులలో ఏపీఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా రూ.530 కోట్లతో ప్రభుత్వ మెడికల్ కళాశాలను 50 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. 627 పడకల వసతి గల ఆస్పత్రి నెలకొల్పారు. ఏడాదికి 150 మెడికల్ సీట్లు, 60 నర్సింగ్ సీట్లలో విద్యను అభ్యసించేలా వసతులు సమకూర్చారు.

మంజూరైన సీట్లు తిరస్కరించి..

పులివెందుల మెడికల్ కళాశాల అన్ని అనుమతులు సాధించింది. 2024 ఆగస్టు 5న ఎన్ఎంసీ పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 50 ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మౌలిక వసతులన్నీ ఉన్నా, కళాశాల ఫ్యాకల్టీ, పెండింగ్ పనులను దృష్టిలో పెట్టుకొని 50 సీట్లు మాత్రమే కేటాయించింది. పెండింగ్ పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నుంచి అండర్ టేకింగ్ లెటర్ కోరింది. ఆ లెటర్ ఇచ్చేందుకు చంద్రబాబు సర్కార్ సుముఖత చూపలేదు. పైగా ఎన్ఎంసీ కేటాయించిన 50 ఎంబీబీఎస్ సీట్లు రద్దు చేసుకోవాల్సిందిగా ప్రత్యుత్తరం రాయడం గమనార్హం. కేటాయించిన సీట్ల కంటే మరిన్ని అదనంగా కావాలని కోరే ప్రభుత్వాలను చరిత్రలో చూశాం. మంజూరైన సీట్లను తిరస్కరించిన ఏకైక సర్కార్ ఇదేనని విశ్లేషకులు అంటున్నారు. అప్పట్లో అంగీకరించి ఉంటే 2025-26 విద్యా సంవత్సరానికి మరో 150 ఎంబీబీఎస్ సీట్లు దక్కేవి. ఈ ప్రాంతంలోని పేద విద్యార్థులు ఈ సువర్ణ అవకాశం కోల్పోవాల్సి వచ్చిందని పరిశీలకులు వాపోతున్నారు.

» కుప్పం దాహార్తి తీర్చడానికి వైఎస్ కుటుంబం కృషి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేయడంలో తరతమ భేదం లేదని తేల్చి చెప్పేందుకు.. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం పెద్ద ఉదాహరణగా నిలుస్తోంది. కుప్పం ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.52 కోట్లతో పాలారు రిజర్వాయర్ మంజూరు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభమై కుప్పం మీదుగా తమిళనాడుకు వెళ్లే పాలారు నదిపై రిజర్వాయర్ నిర్మించి కుప్పం నియోజకవర్గానికి తాగునీరు, సాగునీరు అందించే బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు. తర్వాత తమిళనాడు ప్రజలతో కొందరు కోర్టులో కేసు వేయించడంతో అప్పట్లో ఆ పనులు పెండింగ్‌లో పడ్డాయి. తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా కుప్పం నియోజకవర్గానికి నీరు ఇచ్చారు. శాంతిపురం, రామకుప్పం చెరువులను నీటితో నింపి పెద్ద మనసు చాటుకున్నారు. పైగా కుప్పం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. కాగా ప్రస్తుతం పులివెందులలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను కొనసాగించేందుకు సీఎం చంద్రబాబు మనసు సుతారాము అంగీకరించడం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పులివెందుల పంచాయితీ, రాజారెడ్డి రాజ్యాంగం అంటూ ప్రాంతంపై విషం కక్కడం ఆయనకున్న వివక్షత ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ముఖ్యమంత్రిగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలో ప్రవేటు పరం చేయడంపై సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

» ప్రైవేటుకు అప్పగిస్తే ఉద్యమం



మెడికల్ కళాశాల వద్ద సీపీఐ నేతల నిరసన

పులివెందుల: పులివెందుల మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగిస్తే ఉద్యమిస్తామని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకటరాములు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక పులివెందుల మెడికల్ కాలేజీ వద్ద సీపీఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీలకు సంబంధించి ఏపీ మంత్రివర్గం తీసుకున్న పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం) నిర్ణయం పేదల ఆరోగ్యాన్ని గాలికి వదిలేయడమేనన్నారు.

కక్ష సాధింపు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కక్ష సాధింపులో భాగంగా పులివెందుల మెడికల్ కళాశాలను ప్రైవేట్‌పరం చేస్తున్నారు. వెనుకబడిన పులివెందుల ప్రాంతాన్ని దివంగత వైఎస్సార్, ఆ తర్వాత వైఎస్ జగన్‌లు అభివృద్ధి చేశారన్నారు. ఈ ప్రభుత్వం కేవలం వారిపై ఉన్న కక్షతో పులివెందులపై వివక్ష చూపుతున్నారు. కేంద్రం ఇచ్చిన 50 మెడికల్ సీట్లను కూడా ఈ ప్రభుత్వం తిరస్కరించింది. ఈ ప్రాంత వాసులు మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇక్కడే పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందడానికి, అలాగే వైద్య విద్యార్థుల కోసం మెడికల్ సీట్ల కోసం పులివెందులలో రూ.400 కోట్లకుపైగా ఖర్చు చేసి నిర్మించిన మెడికల్ కళాశాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం దారుణం. – వరప్రసాద్, మున్సిపల్ చైర్మన్, పులివెందుల

పేద విద్యార్థులకు తీవ్ర నష్టం



పులివెందుల మెడికల్ కళాశాల పెండింగ్ భవనాలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కళాశాల నిర్వహించాలి. గత సంవత్సరమే అడ్మిషన్లు జరగాల్సి ఉండేది. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాకం వల్ల అడ్మిషన్లు చేపట్టకపోవడం వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రైవేటు పరం చేయడం వల్ల వైద్యం వ్యాపారంగా మారుతుంది. –ఎస్.వెంకటశివ, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, కడప

ప్రైవేటు ఆలోచన విరమించుకోవాలి



పులివెందుల మెడికల్ కళాశాలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటు పరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన తక్షణమే ఉపసంహరించుకోవాలి. మేము అధికారంలోకి వస్తే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేసి మెరుగైన విద్య అందజేయడమే కాకుండా ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేస్తామంటూ ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మంత్రి నారాయణ లాంటి వారికి మెడికల్ కళాశాలలను కట్టబెట్టే యత్నం చేయడం తగదు. –ఎ.రామ్మోహన్‌రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి, కడప

ప్రజలచేత ఎన్నుకోని ప్రభుత్వం



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వాటిని ప్రస్తుత ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమైన చర్య. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ఈ కళాశాలలను తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. –ఓతూరు రసూల్, నూర్ బాషా సంఘ కార్పొరేషన్ మాజీ చైర్మన్, పులివెందుల

న్యూస్‌రీల్

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్: దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా రెండవరోజు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చతుష్టార్చన, ద్వారతోరణ, అనంత కళాపూజ, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు నిత్య హోమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్, ఇతర అర్చకులతోపాటు ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

13న ఈవీఎంలపై చర్చ

కడప రూరల్: రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన హైదరాబాదులోని సామాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఈవీఎంలపై వ్యతిరేక జాతీయ ఉద్యమ చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ కన్వీనర్ సంగటి మనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ భారతదేశ ముఖ ద్వారమైన హైదరాబాదులో మధ్యాహ్నం 2 గంటలకు ఈవీఎంలకు వ్యతిరేకంగా చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు సంఘాల నేతలు అవ్వారు మల్లికార్జున, కైపు రామాంజనేయులు, దేవర శ్రీకష్ణ, గుర్రప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ పాడ్ కాస్ట్ ప్రారంభం

వేంపల్లె: ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయి ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో యూనివర్సిటీ పాడ్ కాస్ట్‌ను ప్రారంభించారు. శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోని కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కో ఆర్డినేటర్ నందిగం సత్యానందరాం ఆధ్వర్యంలో నిజమైన చర్చలు, నిజమైన నైపుణ్యాలు, వాస్తవ ప్రపంచం అనే పేరుతో యూనివర్సిటీ పాడ్‌కాస్ట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో యూఎస్ఏ నుంచి సీనియర్ మైక్రో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న మధుసూదన్‌రెడ్డి విద్యార్థులకు ప్రస్తుతం ఐటీ రంగంలో ఉన్న అవకాశాలు, విద్యార్థులు అలవర్చుకోవాల్సిన నైపుణ్యాలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి పి.రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

- ఈ నెల 9న మైదుకూరులో ధర్నా, నిరసన ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి

చాపాడు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా రైతు సమస్యలు పట్టించుకోకుండా రైతాంగాన్ని విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రైతాంగాన్ని విస్మరించడం వల్ల ఈనెల 9న మైదుకూరులో ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కొరత ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కడప జిల్లాలో అత్యధికంగా మైదుకూరు నియోజకర్గంలో 92 వేల ఎకరాల్లో ప్రతి ఏటా వరితోపాటు వివిధ రకాలైన పంటలు సాగుతాయన్నారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో యూరియా కొరత రైతులను వేధిస్తోందన్నారు. గత వారం రోజుల నుంచి మైదుకూరు నియోజకవర్గంలోని ఎరువుల దుకాణాల్లో యూరియా విక్రయించడం లేదన్నారు. దీంతో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో పలు చోట్ల ఎరువుల దుకాణాల్లో బస్తా రూ.400తో వ్యాపారులు గోప్యంగా విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. మరో వైపు ఉల్లి పంటను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ఏమో క్వింటాల్ రూ.2 వేలకు కొనుగోలు చేస్తామని చెబుతున్నప్పటికీ కనీసం రూ.800కు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. ఈ క్రమంలో మైదుకూరులో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

భారతదేశం మత సామరస్యానికి ప్రతీక





ర్యాలీలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మతపెద్దలు, నగర ముస్లిం ప్రముఖులు, నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

- మహా ప్రవక్త అడుగుజాడల్లో నడవాలి
- మిలాదున్నబీ ర్యాలీలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: భారతదేశం మత సామరస్యానికి ప్రతీక అని, అందరూ మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) అడుగ జాడల్లో నడవాలని మాజీ డిప్యూటీ సీఎం ఎస్బీ అంజద్‌బాషా పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలో నిర్వహించిన ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడారు. మహా ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పేరుతో నిర్వహించుకుంటారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు, కడప నియోజకవర్గ ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ)ను అల్లాహ్ చివరి ప్రవక్తగా పంపారని పేర్కొన్నారు. ఆయన్ను ముస్లింలకే కాకుండా యావత్ మానవాళికి ప్రవక్తగా పంపారని తెలిపారు.

నగరంలో భారీ ర్యాలీ: మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని కడప నగరంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మర్కజీ మిలాద్ జులూస్ ఆధ్వర్యంలో అగాడిలోని ఇనాయత్‌ఖాన్ తాలిం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అల్మాస్‌పేట, వన్‌టౌన్, పొట్టిశ్రీరాములు సర్కిల్, ఏడురోడ్ల కూడలి, పాతబస్టాండు మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువకులకు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు హజరత్ మహమ్మద్ అలీబొగ్దాది, హజరత్ వలీవుల్లా హుసేనీ సాహెబ్, హజరత్ అబ్దుల్ రెహ్మాన్ బొగ్దాది, హజరత్ అబ్దుల్ రహీం, హమీద్ హుసేన్, నగర ముస్లిం ప్రముఖులు అమీర్‌బాబు, ఆరీవుల్లా, నజీర్ అహ్మద్, అలీఖాన్, సుబాన్‌బాషా, షఫీవుల్లా, మహమ్మద్ అలీతో పాటు పెద్దఎత్తున ముస్లిం యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. సమాజ నిర్మాతలు



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు



కలసపాడు హెచ్ఎం మెర్సీ మాలనిని సన్మానిస్తున్న అధికారులు

- ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు
- 64 మంది టీచర్లకు అవార్డులు ప్రదానం

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి మూలస్తంభాలని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం కడప కలెక్టరేట్ సభాభవన్‌లో మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా వారంతా జ్యోతి వెలిగించి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైయిందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది రాజకీయ నాయకులు, అధికారులు కాదని గురువులేనని తెలిపారు. పిల్లలకు ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా బోధించాలన్నారు. ఒక ఉపాధ్యాయుడు విధి నిర్వహణలో పొరపాటు చేస్తే దాని ప్రభావం మొత్తం సమాజంపైన పడుతుందన్నారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ తాను 15 ఏళ్ల క్రితం ఉపాధ్యాయ వృత్తి నుంచే వచ్చానన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తన నాన్న కూడా ఉపాధ్యాయుడేనని, ఆయన మార్గదర్శకంలో నడిచి ఈ రోజు ఈ స్థాయికి వచ్చానన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 64 మందికి అవార్డులు అందజేశారు. వారిని శాలువతో సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జేడీ కాగిత శ్యాముల్, డీఈఓ షేక్ షంషుద్దీన్ డీఆర్‌ఓ విశేశ్వరనాయుడు, ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యానందరాజు, డిప్యూటీ ఈవోలు రాజగోపాల్‌రెడ్డి, మీనాక్షి, జిల్లా సైన్సు ఆఫీసర్ ఎబినైజర్, జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటన్ సాంబశివారెడ్డి, సైన్సు మ్యూజియం క్యూరేటర్ రెహమాన్, పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..



వైఎస్సార్ జిల్లా ఎం.రాఘువేంద్రమ్మను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వెంకట హేమాదేవి

తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం గురుపూజోత్సవ వేడకల్లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – విజయవాడ

క్లుప్తంగా

కర్నూలులోనే కృష్ణా నది బోర్డు ఉండాలి

– పీసీసీ డెలిగేట్ శ్రీనివాసులరెడ్డి

పులివెందుల టౌన్ : కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని పీసీసీ డెలిగేట్ వేలూరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణానది జలాలు తెలంగాణ రాష్ట్రం తర్వాత కర్నూలు జిల్లాలోకి చేరుకుంటాయని, తెలుగుగంగ, జీఎస్‌ఎస్‌ఎస్ ప్రాజెక్టు, వెలుగోడు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ కడప జిల్లాకు అత్యంత ప్రాధాన్యత ఉన్న గండికోట ప్రాజెక్టు, తదితర ప్రాజెక్ట్‌లకు ఆధారమైన శ్రీశైలం ప్రాజెక్టు ఉన్న కర్నూలు జిల్లాలోనే కృష్ణానది యాజమాన్య బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణానది నీటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత గల శ్రీశైలం ప్రాజెక్టు రాయలసీమలోనే ఉందనే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే ప్రభుత్వాలు హైకోర్టు, రాజధాని రెండూ అమరావతిలోనే ఏర్పాటు చేసి రాయలసీమకు అన్యాయం చేశాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీరాములు

కమలాపురం : కమలాపురం–ఖాజీపేట ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కామనూరు శ్రీరాములు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గంగవరం సమీపంలోని కుందూ నది వద్ద ఉన్న కాశీనాయన దేవాలయం సమీపంలో అరుగుపై కూర్చుని ఉన్న శ్రీరాములును సిమెంట్ ట్యాంకర్ ఢీకొంది. ఈ ఘటనలో శ్రీరాములు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనం ద్వారా క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ మద్యం మత్తులో ఉండటంతో స్థానికులు అతడిని చితకబాదారు.

మద్యం దుకాణంలో చోరీ

ఖాజీపేట : మండలంలోని ఎస్‌వీబీ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. సుమారు నాలుగు కేసుల మద్యంతోపాటు క్యాష్ కౌంటర్‌లోని కొద్ది మొత్తంలో డబ్బును దొంగలు దోచుకుపోయారు. ఖాజీపేట బ్రిడ్జి అవతల ఉన్న మద్యం దుకాణంకు చెందిన యజమానులు శుక్రవారం ఉదయం దుకాణం తెరిచి చూడగా వెనుక భాగంలోని తలుపు తెరిచి ఉండటం గమనించారు. వెంటనే దుకాణంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. గురువారం అర్ధరాత్రి ముఖానికి మాస్కు ధరించిన దొంగ తలుపు పగులకొట్టి లోనకు ప్రవేశించాడు. దుకాణంలోని నాలుగు కేసుల మద్యంతో పాటు క్యాష్ కౌంటర్‌లోని కొద్ది మొత్తంలో డబ్బు చోరీ చేసినట్లు గుర్తించారు. సీసీ కెమెరాలో ఉన్న దృశ్యాలను పరిశీలించిన తరువాత ఖాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు.



దుకాణంలో చోరీకి పాల్పడుతున్న దొంగ

పెన్నానదిలో వృద్ధ దంపతులు ఆత్మహత్య

- విస్తృతంగా జాలర్లు గాలింపు
- మాచుపల్లి సమీపాన మృతదేహాలు లభ్యం





మృతులు వెంకటసుబ్బయ్య, నాంచారమ్మ (ఫైల్), పెన్నానది నుంచి మృతదేహాలను బయటకు తెస్తున్న దృశ్యం

సిద్దవటం : పెన్నా నదిలో వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకోవడంపై పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన వెంకట సుబ్బయ్య (84), నాంచారమ్మ (80) దంపతులు బుధవారం తమ ఒంటిపై ఉన్న నగలు, నగదు ఇంటిదగ్గర పెట్టి కనబడకుండా పోవడంతో వారి పెద్ద కుమారుడు మహేష్ చెన్నూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారణ చేపట్టి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం సాయంత్రం సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రేణుకా ఎల్లమాంబ అమ్మవారిని దర్శించుకొని కాసేపు అక్కడే విశ్రాంతి తీసుకొని పెన్నా నదిలో మొదట నాంచారమ్మ దూకగా కేసుపు అటూ ఇటూ ఇతరుగుతూ తడబడి వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి కూడా పెన్నాదిలో దిగాడు. ఆలయంలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదు కాగా ఒడ్డున నాంచారమ్మ పాదరక్షలు ఉండటంతో బంధువులు గుర్తించారు. మృతి చెందిన వృద్ధ దంపతుల చిన్న కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు ఐదుగురు జాలర్ల సహాయంతో పెన్నా నదిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మాచుపల్లి గ్రామ సమీప ప్రాంతాలలోని ముళ్లపొదల్లో మృతదేహాలు ఉన్నట్లు జాలర్లు గుర్తించి పెన్నా నదిఒడ్డున చేర్చారు. మృతి చెందిన వృద్ధులుగతకొన్ని రోజులుగా దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతూ అవస్థలు పడేవారు. పలుమార్లు వైద్యశాలలో చికిత్స కూడా చేయించామని వారి బంధువులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం మాచుపల్లి పెన్నా నది ఒడ్డున రిమ్స్ వైద్యుడు శవ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

నెల్లూరు జట్టు ఘన విజయం



నారాయణ, నెల్లూరు (3 వికెట్లు)



అఖిల్, నెల్లూరు (3 వికెట్లు)



శివ కేశవ, కడప (66 పరుగులు)



ఆదిల్ హుస్సేన్, కడప (58 పరుగులు)

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–23 మల్టీ మ్యాచ్‌లు శుక్రవారం మూడవ రోజు అనంతపురం జట్టుపై నెల్లూరు జట్టు ఘన విజయం సాధించింది. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో 14 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని భార్గవ్ రాజు 45 పరుగులు, అర్జున్ టెండూల్కర్ 44 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నారాయణ 3 వికెట్లు, అఖిల్ 3 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 160 అధిక్యంతో విజయం సాధించింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 239 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 350 పరుగులు చేసింది. అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 242 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 187 పరుగులు చేసిన విషయం తెలిసిందే.

డ్రాగా ముగిసిన కడప–కర్నూలు మ్యాచ్ : వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కడప–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 80 ఓవర్లకు 8 వికెట్లు కోల్పోయి 297 పరుగులు చేసింది. ఆ జట్టులోని శివ కేశవ 66 పరుగులు, ఆదిల్ హుస్సేన్ 58 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని సాయి సూర్యతేజ రెడ్డి 4 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 4 ఓవర్లకు 40 పరుగులు చేసింది. దీంతో కడప–కర్నూలు జట్ల మధ్య మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 297 పరుగులు చేసింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 314 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 40 పరుగులు మాత్రమే చేసింది. ఈ మ్యాచ్‌లో కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో అధిక్యంతో ఉండటంతో 03 పాయింట్లు లభించాయి.

టపాసులు పేలి గాయపడిన వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారి మఠం మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ బాగాదుపల్లెలో గత శుక్రవారం వినాయక చవితి సందర్భంగా వినాయకుడిని ఊరేగింపులో ప్రమాదవశాత్తు టపాసులు పేలి కుమ్మితి పాలకొండయ్య (35)కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుటాహుటిన బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. అయితే మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించగా గత వారం రోజులు గా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. తమను ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి భార్య పిల్లలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మతిస్థిమితం లేని మహిళ భర్తకు అప్పగింత



మతిస్థిమితం లేని మహిళను ఆమె భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

కలసపాడు : మండలంలోని తెల్లపాడు గ్రామంలో గురువారం రాత్రి మతిస్థిమితం లేని మహిళ తిరుగుతుండగా స్థానికులు గుర్తించి 112కు సమాచారమిచ్చారు. దీంతో నైట్‌డ్యూటీలో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను విచారించగా తన పేరు ఉప్పరపురమాదేవి అని, చాపాడు మండలం ఎస్.ఓబాయపల్లె గ్రామానికి చెందినదిగా పోలీసులకు తెలిపింది. వెంటనే పోలీసులు ఆమె భర్త యేసోబుకు సమాచారం అందించి స్టేషన్‌కు పిలిపించి రమాదేవిని ఆమె భర్తకు అప్పగించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాయచోటి టౌన్ : రోడ్డు ప్రమాదంలో మురికినాటి రాజారెడ్డి (75) అనే వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ కుళాయప్ప కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం చెన్నముక్కపల్లె నుంచి తన పొలానికి స్కూటీపై రాజారెడ్డి వెళ్తుండగా కడప వైపు నుంచి మదనపల్లె రోడ్డు వైపు వస్తున్న ఏపీ39 యుఎస్ 9908 నంబర్ గల కారు ఢీకొంది. రాజారెడ్డి తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుమారుడు గంగిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కమనీయం.. శ్రీరంగనాథుని కల్యాణం





రంగనాథస్వామిని దర్శించుకుంటున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ముగిసిన శ్రీరంగనాథస్వామి నూలు పూజ పవిత్రోత్సవాలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారి నూలు పూజా పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లె కృష్ణరాజేష్ శర్మ నేతృత్వంలో భక్తులు చల్లా వంశీయుల సహకారంతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాథ స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవాయిద్యాల నడుమ భక్త జనసందోహంతో వేద మంత్రోచ్చారణలతో కమనీయంగా స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అంకాలమ్మ దేవస్థాన చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, పెద్దిరాజు, తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ చైర్మన్ సుధీర్ రెడ్డి ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కళ్యాణ అనంతరం చల్లా వంశీయుల సౌజన్యంతో వేలమందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం శ్రీరంగనాథ స్వామి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో శ్రీరంగనాథస్వామి నూలుపూజ పవిత్రోత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వి.రమణ, ఆలయ చైర్మన్ సుధీకర్ రెడ్డి, శ్రీరంగనాథ ట్రస్ట్ సీఈఓ అల్లం రంగనాయకులు, వాసవీ ఆలయ ప్రధాన అర్చకులు సాయి భరద్వాజ శర్మ, ఆలయ పాలకమండలి సభ్యులు కాంభోజి మల్లికార్జున, దశరథ రామిరెడ్డి, మాధవాచారి, మేడం దినేష్ కుమార్, ఆలయ సిబ్బంది,భక్తులు,తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో మందుబాబుల వీరంగం

- చిల్లర దుకాణంపై పెట్రోల్‌తో దాడి
- చిల్లర బాకీ అడిగినందుకు ఘాతుకానికి దిగిన మందుబాబులు



చిల్లర దుకాణంలో చెలరేగిన మంటలు

ఒంటిమిట్ట : బాకీ అడిగాడని చిల్లర దుకాణంపై మందుబాబులు పెట్రోల్ పోసి దాడి చేశారు. బాధితుల వివరాల మేరకు..చిన్న కొత్తపల్లికి చెందిన కట్టా మల్లికార్జున అనే వ్యక్తి ఒంటిమిట్టలోని కల్యాణ్ రామ్ టౌన్‌షిప్ వద్ద ఉన్న పట్నం పెంచలయ్య చిల్లర దుకాణంలో చిల్లర బాకీ చేసి ఉన్నాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.50 గంటలకు కట్టా మల్లికార్జున పెంచలయ్య చిల్లర దుకాణానికి వచ్చాడు. మల్లికార్జున రావడంతో దుకాణాదారుడు పెంచలయ్య తనకు బాకీ ఉన్న చిల్లర తిరిగి ఇవ్వాలని అడిగాడు. ఎంత ఉందని మల్లికార్జున పెంచలయ్యను ప్రశ్నించాడు. రూ. 170 బాకీ ఉందని చెప్పగా నువ్వు రూ. 100 అబద్ధం చెబుతున్నావు. నేను బాకీ రూ.70 మాత్రమే ఉన్నానని దుకాణాదారుడు పెంచలయ్యపై మద్యం మత్తులో ఉన్న కట్టా మల్లికార్జున దాడి చేశాడు. దీంతో దెబ్బలు తిన్న దుకాణాదారుడు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలుసుకున్న మద్యం మత్తులో ఉన్న కట్టా మల్లికార్జున ఆగ్రహావేశంతో కట్టా బాలకృష్ణ అనే వ్యక్తితో కలిసి సాయంత్రం 4:50 గంటలకు వచ్చి, పెట్రోల్ పోసిన ప్యాకెట్లను పెంచలయ్య దుకాణంపై విసిరి, దుకాణానికి నిప్పుపెట్టి పారిపోయారు. వెంటనే స్పందించిన దుకాణాదారులు, స్థానికులు మంటల్లో కాలిపోతున్న దుకాణంపై నీరు పోసి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో బాధితుడు పెంచలయ్య దుకాణంలో రూ. 45 వేల ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు. తనకున్న బాకీ అడిగినందుకు తనకున్న జీవనాధారమైన దుకాణంపై దాడిచేయడం అమానుషమని, ఇంతటి దౌర్జన్యం, రౌడీయిజం ఎన్నడు లేదని దుకాణదారుడు కన్నీటి పర్యంతం అయ్యాడు. ఇంతటి ఘాతుకానికి పాల్పడిన మందుబాబులను కఠినంగా శిక్షించాలని బాధిత దుకాణాదారుడు పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేశానన్నాడు. ఒంటిమిట్ట పోలీసులు దాడికి గురైన దుకాణం వద్దకు చేరుకుని, దాడి జరిగిన ప్రదేశాన్ని, సీసీ కెమెరాలో దాడికి సంబంధించి వీడియోను పరిశీలించారు.

బోధనలో ఒరవడి సృష్టిస్తున్న ఖాసీంవలి



కడపలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో ఖాసీంవలిని సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎస్పీ అశోక్ కుమార్

కాశినాయన : పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు సైతం విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నదే ఆ ఉపాధ్యాయుడి తపన. అతడి పేరు ఖాసీంవలి. మండలంలోని బాలాయపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన తండ్రి ఖాసీం సాబ్ రిక్షా తొక్కుతూ అతనికి వచ్చిన సంపాదనలో కుమారుడు కొడుకును ఉన్నత స్థాయిలో చూడాలని చదివించాడు. తండ్రి ఆశయం కోసం అతడు ఎంతో కష్టపడి చదివి 2011లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టాడు. రాజంపేట మండలంలోని చెంచురాజుపల్లెలో 2011లో ఉపాధ్యాయుడిగా చేరి 2021 వరకు దశాబ్దకాలం పనిచేసి అటు విద్యార్థులు, ఇటు గ్రామ ప్రజల మన్ననలను పొందారు. పేదరికం అంటే ఏమిటో తెలిసిన వ్యక్తిగా ఖాసీంవలి పేద విద్యార్థులను చేరదీసి వారి ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షించి తనదైన శైలిలో చక్కగా పాఠాలు బోధించారు. చెంచురాజుపల్లె నుంచి నలుగురు విద్యార్థులను నవోదయ పాఠశాల ప్రవేశానికి శిక్షణ ఇచ్చి నలుగురు విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపికకావడం ఆయన ప్రతిభకు నిదర్శనంగా చెప్పవచ్చు. దాతల సహకారంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బోధన సామగ్రిని పంపిణీ చేయించి పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 2021లో బదిలీపై మండలంలోని పిట్టికుంట ఎంపీపీ పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫాం కుట్టించుకోవడానికి డబ్బులు లేని విద్యార్థులకు ఖాసీం వలి తన సొంత డబ్బుతో యూనిఫాం కుట్టించి మానవత్వం చాటుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో బాలాయపల్లె పాఠశాలకు వెళ్లారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో పాఠశాల ఆవరణలో మొక్కలను నాటించి గ్రామస్తులు, మండల విద్యాశాఖ అధికారుల మన్ననలను పొందారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడపలో నిర్వహించిన సభలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఖాసీంవలి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఖాసీం వలి మాట్లాడుతూ పేదరికం కారణంగా తాను ఎన్నో ఇబ్బందులు పడి ఉపాధ్యాయుడినయ్యానని తెలిపారు. పేదరికం కారణంగా విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని తన వంతు కృషి చేస్తున్నానన్నారు. ప్రతి పేద విద్యార్థి చక్కగా చదివి ఉన్నత స్థాయికి చేరి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన ఖాసీంవలికి జనవిజ్ఞాన వేదిక జిల్లా, రాష్ట్ర నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

లైసెన్స్ ముగిసినా.. యథేచ్ఛగా మద్యం అమ్మకాలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కమలాపురం పట్టణం క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పునీత్ బార్‌కు నిబంధనలు వర్తించవా? అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత నెల 31వ తేదీకి పునీత్ బార్‌కు సంబంధించిన లైసెన్స్ గడువు ముగిసింది. అయినప్పటికి శుక్రవారం బార్‌ను తెరిచి సిబ్బంది యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిపారు. రాజకీయ నాయకుల అండదండలతో బార్‌లోనూ, బార్ చుట్టూ విక్రయాలు జరిపారు. విషయం తెలుసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్ ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాలతో డీటీఎఫ్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నీలకంఠారెడ్డి, ఎర్రగుంట్ల ఎక్సైజ్ సీఐ గోపీనాథ్‌లు కలసి బార్‌పై శుక్రవారం మధ్యాహ్నం దాడులు జరిపారు. అధికారుల తనిఖీలో లైసెన్స్ లేకుండానే మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు తేలడంతో బార్‌ను మూసి వేశారు. బార్‌లో ఉన్న మద్యంను తీసుకెళ్లకుండా స్థానిక కూటమి నాయకుల అనుచరులు ఒత్తిడి చేశారు. బార్‌ల లైసెన్స్‌లు పొందడానికి కూటమి ప్రభుత్వం గడువు పెంచినప్పటికి టెండర్ వేయకుండా ఇలా బరితెగించి అక్రమంగా మద్యం విక్రయించడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ నాయకుల చేష్టలతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బార్‌ల లైసెన్స్‌కు టెండర్లు వేయడానికి టెండర్ దారులు సిద్ధంగా ఉన్నప్పటికి వేయకుండా రాజకీయ నాయకులు అడ్డుకోవడం ఎంత వరకు సబబు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. బార్ చుట్టూ అక్రమంగా మద్యం విక్రయిస్తే టెండర్లు వేయడానికి ఏదీ ఏమైనప్పటికి మద్యం అక్రమంగా విక్రయిస్తున్న పునీత్ బార్‌ను శాశ్వతం మూసి వేయాలని ప్రజలు కోరుతున్నారు. లైసెన్స్ ఉన్న మద్యం షాపు ఎదుటే లైసెన్స్ లేకుండానే మద్యం విక్రయిస్తుంటే ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోందని వారు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రం అంతా నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరుపుతుంటే కమలాపురంలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్ లేకుండా విక్రయాలు జరపడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించి పునీత్ బార్ చుట్టూ మద్యం విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆస్తి వివాదాల నేపథ్యంలో దాడి

- అడ్డుతగిలాడనే అక్కసుతో రమేష్ నాయక్‌పై సజీవదహన యత్నం
- ఆరుగురు నిందితులు అరెస్ట్, కారు స్వాధీనం



నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కే.మహేంద్ర

మదనపల్లె రూరల్ : అన్నదమ్ముల ఆస్తివివాదాల నేపథ్యంలోనే బీకే.పల్లె వైఎస్సార్ కాలనీలోని షేక్ సలీంబాషా ఇంటిపైకి రాయచోటికి చెందిన వ్యక్తులు దాడిచేశారని డీఎస్పీ మహేంద్ర తెలిపారు. దాడి చేసే క్రమంలో సలీంబాషా ఇంటి కింది భాగంలో దుకాణం నిర్వహిస్తున్న రమేష్‌నాయక్ అడ్డుపడటంతో ఆగ్రహించి, పెట్రోల్ పోసి సజీవ దహనానికి యత్నించారన్నారు. సజీవ దహనానికి ప్రయత్నించిన కేసులో రాయచోటికి చెందిన ఆరుగురు నిందితులను శుక్రవారం పట్టణంలోని రామారావుకాలనీ ఆటోస్టాండ్ వద్ద అరెస్ట్ చేసి, నేరం చేసేందుకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఎస్పీ మహేంద్ర కేసుకు సంబంధించి తెలిపిన వివరాలిలా.. పట్టణ శివారుప్రాంతం బీకే.పల్లె వైఎస్సార్ కాలనీలోని షేక్ సలీంబాషా తండ్రి షేక్ మహబూబ్‌బాషా, రాయచోటికి చెందిన ఖాసింసాబ్ అన్నదమ్ములు. వీరి రెండు కుటుంబాల మధ్య ఆస్తి విషయంగా మనస్పర్థలు ఉన్నాయి. ఏడాది క్రితం షేక్ మహబూబ్‌బాషా రాయచోటిలో చనిపోయాడు. ఈ విషయంగా షేక్ మహబూబ్‌బాషా కుటుంబ సభ్యులకు అతడి మరణంపై అనుమానాలు ఉన్నాయి. ఆయన మరణానంతరం ఆస్తుల పంపకాలకు సంబంధించి వివాదాలు ఏర్పడ్డాయి. దీంతో ఇరుకుటుంబాల మధ్య మనస్పర్థలు మరింత ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో ఈనెల 3వ తేదీ తెల్లవారుజామున రాయచోటికి చెందిన ఖాసింసాబ్ కుమారులు షేక్‌జావేద్ హుస్సేన్(25), షేక్ షామీర్ హుస్సేన్(29)లు తమకు పరిచయస్థులైన షేక్ ఇలాహి అలియాస్ ఫాజిల్(32), కలికిరి మండలం దూదేకులపల్లెకు చెందిన వేంపల్లె మస్తాన్(38), కే.వి.పల్లె మండలం తిమ్మాపురం కొత్త ఇండ్లుకు చెందిన షేక్ అమీర్‌సాహెబ్(28), కలికిరి మండలం గుండ్లూరుకు చెందిన కారు డ్రైవర్ కొమ్మిరిశెట్టి విశ్వనాథ్ బాబుతో కలిసి మదనపల్లెలోని వైఎస్సార్ కాలనీకి చేరుకున్నారు. పథకం ప్రకారం మార్గమధ్యంలో ఓ పెట్రోల్‌బంకు వద్ద కారుకు డీజిల్ పట్టించి, బాటిల్స్‌లో పెట్రోల్ నింపుకున్నారు. సలీంబాషా ఇంటిపై కర్రలు, రాళ్లు, రాడ్స్‌తో దాడి చేస్తూ వీరంగం సృష్టించారు. గేటును రాడ్‌లతో పగలగొడుతూ, ఇంటిపై రాళ్లు రువ్వుతూ, సలీంబాషాపై దాడిచేసేందుకు యత్నించారు. సలీంబాషా ఇంట్లో అద్దెకు ఉంటున్న రమేష్‌నాయక్ శబ్దాలు విని గొడవను అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహించిన జావీద్‌హుస్సేన్, షామీర్‌హుస్సేన్‌లు తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్ అతడిపై పోసి నిప్పంటించారు. ఈ విషయం గమనించిన సలీంబాషా, టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో వారు వెంటనే స్పందించి ఘటనాస్థలానికి వెళ్లారు. దీంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. కుటుంబసభ్యులు, బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తీసుకెళ్లగా, ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగానే ఉందన్నారు. నిందితులపై దాడి, హత్యాయత్నం, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభచూపిన సీఐ రాజారెడ్డి, ఎస్ఐ రహీముల్లా, సిబ్బందిని అభినందించారు.

నిందితులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు

రాయచోటి నుంచి వచ్చి మదనపల్లెలో రౌడీయిజాన్ని ప్రదర్శించి, ఎస్టీ కులానికి చెందిన రమేష్‌నాయక్‌పై సజీవదహనానికి యత్నించిన కేసులో నిందితులు జిల్లాకు చెందిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులుగా తెలుస్తోంది. నెలరోజుల క్రితం ఇదే వ్యక్తులు మదనపల్లెలో మంత్రి పేరు చెప్పి ఓ భూదందా సెటిల్మెంట్ చేసినట్లు సమాచారం. మంత్రి అండ ఉంది కనుకే.. రాయచోటి రౌడీమూకలు బరితెగించి మదనపల్లెలో దౌర్జన్యానికి పాల్పడ్డారని పలువురు మాట్లాడుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరోగ్యమాత ఉత్సవాలు



మరియమాత సందేశాన్ని తెలియజేస్తున్న గురువులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆరోగ్యమాత తిరునాల మహోత్సవాలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రార్థనల్లో భాగంగా తొలుత జపమాల, పాటలను ఆలపించారు. ఆరోగ్యమాత స్వరూపాన్ని అలంకరించి పల్లకీలో ఊరేగించారు. గుంటూరుకు చెందిన రెవరెండ్ ఫాదర్ దేవ దివ్య సత్ప్రసాద ఆరాధన, ప్రార్థనలు నిర్వహించారు. గుంటూరు ఎస్‌జీజేకు చెందిన రెవరెండ్ ఫాదర్ ఆకుల ధర్మరాజు దివ్య బలిపూజ నిర్వహించి భక్తుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం గురువులు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీ మరియమాత జన్మదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారని తెలిపారు. ఆ తల్లి ప్రేమ తరిగిపోనిదన్నారు. రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహాయ గురువులు, కన్య స్త్రీలు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు